## క్లుప్తంగా

### కూలర్లు, ఫ్యాన్ల పంపిణీ



కామాక్షి పీఠానికి కూలర్లు, ఫ్యాన్లు అందజేసిన ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ స్వప్న బెన్ పాటిల్ తదితరులు

సాక్షి, అమలాపురం: అమలాపురం పట్టణంలో ఉన్న కామాక్షిపీఠంలో శనివారం భారతీయ స్టేట్ బ్యాంకు సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా ఆశ్రమంలో వృద్ధులకు, పిల్లలకు వేసవిని దృష్టిలో ఉంచుకుని నాలుగు కూలర్లను, 6 పెడస్టల్ ఫ్యాన్లు గ్రైండర్, మిక్సీలతో పాటు 50 పైగా తలదిండ్లను, నిత్యావసర సరకులను ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ స్వప్న బెన్ పాటిల్ పంపిణీ చేశారు. స్వప్న బెన్ పాటిల్ మాట్లాడుతూ వృద్ధులకు, పిల్లలకూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలర్లు, ఫ్యాన్లు, వాటితో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందించామన్నారు. బ్యాంకు తరఫున తమవంతు సహాయం అందించామన్నారు. ఎస్‌బీఐ డీజీఎం సంక్రిత్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 50 ఏళ్ల పైబడి కామక్షి పీఠం వందలాది మందిని చేరదీసి ఆశ్రమం నిర్వహిస్తున్న కామేశ మహర్షిని ఆయన అభినందించారు. కామేశ మహర్షిని, ఆశ్రమ నిర్వాహకురాలిని ఘనంగా సన్మానించారు. కామాక్షి పీఠంనకు సాయం చేసినందుకు స్వప్న బెన్ పాటిల్, సంక్రిత్యతో పాటు సుష్మ శ్రీవత్సవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

### శ్మశాన వాటిక ఆధునికీకరణకు రూ.3 లక్షల విరాళం



విరాళం అందజేసిన పబ్బినీడి వెంకట రత్నకుమార్

తాళ్లరేవు: స్థానిక పెంకెవారిపేటలోని శ్మశాన వాటిక అభివృద్ధికి లయన్స్‌క్లబ్, డైమండ్ గ్రూప్ సభ్యుడు పబ్బినీడి వెంకటరత్నకుమార్ రూ.3 లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు. లయన్స్‌క్లబ్ సిల్వర్ జూబ్లీ వారోత్సవాల్లో భాగంగా సుమారు రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న స్మశాన వాటికకు కుమార్ తనవంతు సహాయంగా రూ.3లక్షల నగదును క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజుకు అందజేశారు. ఈ నగదుతో కైలాస భూమిలో రెండు క్రీమేషన్ బీడ్ బెడ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నడింపల్లి వినోద్ తెలిపారు.

### ఎమ్మెల్యేకి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నారు

యానాం: నియోజకవర్గ శాసనసభ్యుడు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు రాజకీయంగా ప్రజల్లో చెడ్డపేరు వచ్చేలా డంపింగ్‌యార్డు స్థలాన్ని సేకరించకుండా అడుగడుగున అడ్డుపడుతున్నారని మాజీ ఎంపీ, పుదుచ్చేరి పీపుల్స్ డెవలప్‌మెంట్ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.రామదాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం, సంబంధిత స్థానిక పరిపాలనా శాఖ మంత్రి స్థలాన్ని ఎంపిక చేయకుండా ఉండడంతో యానాంలో అపారిశుధ్యంతో పెద్ద సంక్షోభం తలెత్తిందని ఆరోపించారు. సీఎం రంగసామి యానాం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలైనందుకే డంపింగ్ యార్డుకు స్థలాన్ని సేకరించడానికి చర్యలు తీసుకోడానికి ముందుకు రావడం లేదని ఆరోపించారు.డంపింగ్‌యార్డు స్థల ఎంపికను తీర్చలేని ప్రభుత్వానికి అవసరమైతే తన మద్దతును ఉపసంహరించుకునేందుకు వెనుకాడనని ఎమ్మెల్యే అశోక్ ఇప్పటికే హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ అసమర్థతకు ఈ చెత్త సమస్య ఉదాహరణగా నిలుస్తుందని తీవ్రంగా దుయ్యబట్టారు. తక్షణం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పేదల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి
- విగ్రహాలకు ఘన నివాళులు



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు





బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

ఉప్పుగుప్తం: పేదల ఆశాజ్యోతి భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలోఘనంగా నిర్వహించారు. శనివారం తన కార్యాలయంలో తహసీల్దార్ వి.ఎస్ దివాకర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సిబ్బందితో కలసి నివాళులర్పించారు. బాలయోగి పార్కులో మాజీ సర్పంచ్ తొత్తరమూడి నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక భీమ్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ నిలువెత్తు విగ్రహానికి ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జీజీహెచ్ డీడీ రవిశంకర్, విద్యుత్ శాఖ అధికారి లంక కృష్ణారావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మురముళ్లలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

అమలాపురం రూరల్: నడిపూడిలో జగ్జీవన్‌రామ్ జయంతిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు పూలమాల వేసిన నివాళిలర్పించారు. పంచాయతీ రాజ్ డీఈఈ పీఎస్ రాజ్ కుమార్, పెచ్చెట్టి చంద్రమౌళి, సబ్ రిజిస్ట్రార్ రాయి రాంబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు ఏబీసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, పొలమూరి ధర్మపాల్ డైరెక్టర్ చాట్ల సత్యనారాయణ పాల్గొన్నారు. సాకుర్రు, అమలాపురం బుద్ధ విహార్ వద్ద, నడిపూడి తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసిన నివాళి అర్పించారు.

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీడీఓ కె.సత్యనారాయణ, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వ్యవసాయ శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు స్థానిక నాయకులు నివాళులు అర్పించారు.

**అల్లవరంలో..**

అల్లవరం: గోడిలోని బొమ్మిడివారిపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం అహర్నిశలు పోరాడారని తెలిపారు. ఆయేన సేవలను కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మి ఆనందరావు, చంటి, బొమ్మి ప్రసాదు, చిన భూషణం, మందా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో...**

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.

**ముమ్మిడివరంలో..**

ముమ్మిడివరం: మండలంలో బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల జగ్జీవన్‌రామ్ నిలువెత్తు విగ్రహానికి అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. అలాగే జనసేన ఆధ్వర్యంలో, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో బాబు చిత్రపటానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పూలమాలలు వేసి నివాలులర్పించారు.



జగ్జీవన్‌రావ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ కృష్ణారావు



జార్జీపేటలో జగ్జీజీవన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రిటైర్డ్ జేడీ సూర్యనారాయణరాజు

### రెండు రోజుల్లో స్పందించకపోతే అడ్డుకుంటాం

అల్లవరం: ఓడలరేవులో చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ గ్రామ సమస్యలపై రెండు రోజుల్లో స్పందించకపోతే కార్యకలపాలను అడ్డుకుంటామని ఓడలరేవు గ్రామస్తులు శనివారం హెచ్చరించారు. టెర్మినల్ వద్ద సాగుతున్న రిలే దీక్షలు 30 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం నుంచి ప్లాంట్ వరకు ఆందోళనకారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత నెల 27వతేదీన అమలాపురం ఆర్డీఓ మాధవి సమక్షంలో ఓఎన్‌జీసీ అధికారులు ఓడలరేవు గ్రామస్తులతో చర్చలు జరిపామని తెలిపారు. ఓడలరేవు గ్రామస్తుల డిమాండ్లపై వారం రోజుల సమయం కావాలని ఓఎన్‌జీసీ అధికారులు కోరారు. చర్చలు జరిగి తొమ్మిది రోజులు కావస్తున్నా నేటికీ వారి నుంచి ఏలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళనకారులు ఓఎన్‌జీసీ అధికారుల తీరుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. రెండు రోజుల్లో స్పందించి న్యాయమైన డిమాండ్ల పరిష్కరించకపోతే కార్యకలాపాలు స్తంభిస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు డి. సత్తిబాబురాజు, మాజీ సర్పంచ్ కొల్లు విష్ణుమూర్తి, రామకృష్ణ, నాతి లెనిన్‌బాబు, కలిగితి ఏసు తదితరులు పాల్గొన్నారు.

### 11 బీసీ సమరభేరి

ఉప్పలగుప్తం: ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతీరావుపూలే జయంతి సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే బీసీ సమరభేరి కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బీసీ సమరభేరి కార్యక్రమానికి నియోజకవర్గ బీసీలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని అమలాపురం నియోజకవర్గ బీఎస్‌పీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో ఉన్న జ్యోతిరావపూలే విగ్రహం వద్ద బీసీ సమరభేరి పోస్టర్‌ను స్థానిక బీసీ నాయకులతో కలసి శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో చప్పిడి దుర్గారావు, శీలం భాస్కరరావు, గుత్తుల సూర్య, రాయుడు రమేష్, నామాడి నాగేశ్వరరావు, మామిడిశెట్టి బాల శ్రీను పెయ్యల తిరుమలరావు, పెయ్యిల ప్రతాప్ కుమార్, తాళ్ల బాబ్జి, జనిపెల్ల రవీంధర్, పందిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పేరూరులో ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రం తనిఖీ

అమలాపురం రూరల్: పేరూరు గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాన్ని శనివారం జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్తపై ఆరా తీశారు. ప్రత్యేక శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. సర్పంచ్ దాసరి అరుణా డేవిడ్ ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు డీపీవో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేగుళ్ల వెంకట రామన్, జేపీబీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత**

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించి తడి, పొడి చెత్తను వేరువేరుగా పంచాయతీ క్లాప్ మిత్రాలకు అందించాలని డీపీవో శాంతలక్ష్మి సూచించారు. పొలగుమ్మి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్న క్లాప్ మిత్ర కొల్లు అర్జునరావును అభినందించారు.

### భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పట్టణ సీఐ వీరబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: పట్టణంలో ఉన్న వేంకటేశ్వర స్వామివారి కల్యాణ్ మహోత్సవాల ఏర్పాట్లను పట్టణ సీఐ వీరబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. సోమవారం స్వామివారి కల్యాణం, మంగళవారం రథోత్సవం సందర్భంగా ఆలయంలో జరిగే ఏర్పాట్లను ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈవో యర్ర వెంకటేశ్వరరావు, ఎస్సై కిషోర్‌బాబు తో కలసి పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు.

### పాస్టర్ ప్రవీణ్ మృతికి నివాళి





యానాం శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న శామ్యూల్‌సాగర్

యానాం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతికి చింతిస్తూ యానాం ప్రాంత పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎంయూసీఎఫ్ అధ్యక్షుడు, తాళ్లరేవు వైఎస్ఆర్‌సీపీ జెడ్పీటీసీ రెవరెండ్ దొమ్మేటి శమ్యూల్‌సాగర్, పీవైఆర్‌పీడబ్ల్యూఏ అధ్యక్షుడు రెవరెండ్ డేవిడ్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుంచి ఆర్ఏఓ ఆఫీసు సమీపంలోని జెండా స్తంభం వరకు పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాత విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీని నిర్వహించారు. శాంతిర్యాలీకి సంఘీభావం తెలుపుతూ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై నిజానిజాలు బహిర్గతం అయ్యేలా రాజకీయాలకతీతంగా విచారణ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ గిడ్ల చంద్రరావు, వివిధ గ్రామాల పాస్టర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

అమలాపురం రూరల్ : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై బాలాజీ తన బృందంతో తాండవ పల్లి గ్రామంలో శనివారం దాడి చేసి బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గుత్తాల పల్లపు రాజు అదుపులోకి తీసుకున్నారు. తన నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు.

### రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు నాగబత్తుల అవినాష్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. 25 మంది యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, బూసి, రాంబాబు ముడిదుడ్డి రాము,బడుగు అర్జున్, పెయ్యాలా సాయి ,సాపే రమేష్ ,రమేష్ జిల్లెలా,నల్లి చిన్న, జయరాజు,పాటి శ్రీను,డేవిడ్ అంబేద్కర్,హరీష్ ,నాని పాల్గొన్నారు.

### 200 మందికి కంటి పరీక్షలు

తాళ్లరేవు: పటవల శ్రీసాయితేజ స్కూలులో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. స్కూలు ప్రాంగణంలో కరపకు చెందిన విజన్ ఐకేర్ హాస్పిటల్ సిబ్బంది పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బోనం శ్రీనివాస్, నాయకులు అత్తిలి బాబూరావు, విళ్ల వీర, గుద్దటి జమ్మి, రోళ్ల చక్రవర్తి, పుణ్యమంతుల సత్తిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు టీచర్ల నిరసన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు టీచర్లు తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు టీచర్లను రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం హామీ ఇచ్చారని, కాని ఇప్పటివరకు ఆ సమస్యపై పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి నిరసనకు డీఎంకే, ఏఐడీఎంకే పార్టీలనేతలు మద్దతునిచ్చారు.

## నవమి ఉత్సవాలకు రామాలయాలు సిద్ధం



గాడిలంకలో రూపు దిద్దుకున్న సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలు

ముమ్మిడివరం: రాములోరి కల్యాణానికి మండలంలోని ప్రతి గ్రామంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. రామాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి సర్వంగా సుందరంగా తీర్చి దిద్ది చలువ పందిళ్లు వేశారు. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముమ్మిడివరం, కొత్తలంక, అనాతవరం, సీహెచ్‌గున్నేపల్లి, అన్నంపల్లి, కొమానపల్లి, గాడిలంక, కర్రివానిరేవు, మర్లపాలెం, లంకాఫ్ ఠానేల్లంక, పల్లవారిపాలెం తదితర గ్రామాల్లో ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

**కొలువైన విగ్రహాలు**

శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి కల్యాణం జరిపించడంతో అనవాతీగా వస్తోంది. ఈనేపథ్యంలో గాడిలంకలో సీతారామలక్ష్మణ అంజనేయ స్వామి విగ్రహాలు కళాత్మకంగా రూపుదిద్దుకున్నాయి. ఈ విగ్రహాలు ఈ గ్రామాలలో నవమి చలువ పందిళ్లలో కొలువుదీని భక్తులచే పూజలందుకుంటాయి. ఒక అడుగు నుంచి ఐదు అడుగుల వరకు విగ్రహాలను రూపొందించారు. ఇక్కడ నుంచి పరిసర ప్రాంతల ప్రజలు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి సీతారాముల కల్యాణం జరిపించడం అనవాయితీగా వస్తోంది.

## ముగిసిన శివ పంచాయతన యాగం



హోమ గుండానికి నమస్కరిస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: సర్వ మానవాళి శ్రేయస్సు కోసం నక్షత్ర పూర్వక నవగ్రహ సహిత శివ పంచాయతన యగాన్ని దేవగుప్తంలోని ఉమాపార్వతి మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించినట్టు నిర్వాహకులు వేద పండితులు పోచినపెద్ది శ్యామ్ శర్మ తెలిపారు. శివ పంచాయతన యాగం చివరి రోజున శనివారం మహా పూర్ణాహూతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ చింతా అనురాధ, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపీ చింతా అనురాధ, సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై తిరుమలరావుకి ఆశీర్వచనాలు అందించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, తిక్కా ప్రసాదు, పోతుల నాగరాజు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

### దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

తాళ్లరేవు: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేస్తున్న రుణాలకు సంబంధించి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సుమారు వంద మంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.సత్యనారాయణ, మండలంలోని పలు బ్యాంకుల అధికారులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదేవిధంగా బీసీ, ఓసీ లబ్ధిదారులకు ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాంకు మేనేజర్‌ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు.